డిసెంబర్ ఒకటిన మాలల సింహగర్జన

మాలల సింహగర్జన వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వివేక్

పరిగి, నవంబర్ 18 : డిసెంబర్ ఒకటో తేదీన హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి కోరారు. సోమవారం పరిగిలో మాలల సంఘం నాయకులతో కలిసి మాలల సింహగర్జన వాల్‌పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల సంఖ్య తక్కువగా ఉంది, వారిని పట్టించుకోకపోయినా పర్వాలేదనే ఆలోచనలో అన్ని రాజకీయ వర్గాలున్నాయని విమర్శించారు. తెలంగాణలో 30లక్షల మంది మాలలున్నారని తెలిపారు. మాలలకు ఆత్మగౌరవం కల్పించేందుకు ఆత్మగౌరవ సభ ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాలల సంఘం జిల్లా అధ్యక్షుడు సుల్తాన్‌పూర్ వెంకటయ్య, నాయకులు శివరాజు, న్యాయవాది ఆనందం, నాయకులు వెంకట్, యాదయ్య, నర్సింహులు, రాములు, లక్ష్మయ్య, విజయ్, వీరేశం, లక్ష్మణ్, డాక్టర్ బుచ్చిబాబు, మాజీ జడ్పీటీసీ రామకృష్ణ, అంబేద్కర్ విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నర్సింహులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ ..

దోమ, నవంబర్ 18 : మండల పరిధిలోని అయినాపూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం స్వయం పరిపాలనా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకొన్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించడం ద్వారా ఉపాధ్యాయ అనుభవాలను తెలుసుకున్నారు.కార్యక్రమానికి ఎంఈవో వెంకట్ ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మేగ్యా, ఉన్నతపాఠశాల హెచ్ఎం బాబూచంద్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రవికుమార్, సూర్య, ముజీబ్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాండూరు రూరల్, నవంబర్ 18: ఓ వ్యక్తి దవాఖానాలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన కరన్‌కోట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది.ఎస్సై విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తాండూరు మండలం, కరన్‌కోట గ్రామానికి చెందిన జోగు హుస్సేనప్ప(53) అదే గ్రామానికి చెందిన రాంరెడ్డి ఇంట్లో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగేవాడు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఓ చెట్టు ఎక్కి కొమ్మలు నరుకుతుండగా, ప్రమాదవశాత్తు కింద పడగా, తలకు బలమైన గాయమైంది. వెంటనే చికిత్స నిమిత్తం తాండూరులోని దవాఖానాకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు మృతుడి సోదరుడు దస్తప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు 30 క్వింటాళ్ల పత్తి దగ్ధం

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మర్పల్లి, నవంబర్ 18: ప్రమాదవశాత్తు 30 క్వింటాళ్ల పత్తి దగ్ధమై రూ. మూడు లక్షల ఆస్తి నష్టమైన ఘటన మర్పల్లి మండల కేంద్రంలో ఆదివారం రాత్రి జరిగింది.. స్థానికులు, బాధితుడు దేవరాజ్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన దేవరాజ్ మర్పల్లి మండల కేంద్రానికి చెందిన 15 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని పత్తి, కంది ఇతర పంటలు వేశాడు. పొలంలో తీసిన 30 క్వింటాళ్ల పత్తిని రేకుల షెడ్డులో నిలువ చేశాడు. ఆదివారం రాత్రి రోడ్డుపై వెళ్తున్న వాహనదారులకు పొగ, మంటలు కనిపించగా దేవరాజ్‌కు సమాచారం ఇవ్వడంతో వెళ్లి చూడగా అప్పటికే పూర్తిగా ఖాలీ బూడిదైనట్లు తెలిపారు.. సుమారుగా రూ.మూడు లక్షల నష్టం జరిగిందని ప్రభుత్వం నష్టపరిహారం అందించాలని కోరుతు న్నారు. కాగా ఏవో శ్రీకాంత్, ఆర్ఐ మాధవరెడ్డి, ఏఈవో నీరజ, పోలీసులు ఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.

హిమాయత్‌నగర్‌లోని టీటీడీ ఆవరణంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సత్యనారాయణ

9న భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

హిమాయత్‌నగర్, నవంబర్18: తిరుమల తిరుపతి దేవస్థానం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో డిసెంబర్ 9న హిమాయత్‌నగర్‌లోని బాలాజీ భవన్‌లో భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు పరిషత్ సహాయ కార్య నిర్వహణ అధికారి చతుర్వేదుల సత్యనారాయణ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాల ఆవిష్కరణ సోమవారం హిమాయత్‌నగర్‌లోని టీటీడీ ఆవరణంలో జరి గింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబర్ 11న జరిగే గీతా జయంతిని పురస్కరించుకుని 6,7 తరగతుల విద్యార్థులు జూనియర్, 8,9 తరగతుల విద్యార్థులు సీనియర్ విభాగంగా విభజించి ఈ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 18 ఏండ్ల లోపు మొదటి గ్రూపు, 18 ఏండ్ల పైబడిన వారికి నాల్గొవ గ్రూపుగా విభజించి వీరికి సంపూర్ణ భగవద్గీతలోని 700 శ్లోకాలపై పోటీలు ఉంటాయన్నారు. ఈ నెల 23న కుత్బుల్లాపూర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం, డిసెంబర్ 7న సరూర్‌నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగే ఈ పోటీలకు విద్యార్థులు హాజరుకావాలని సూచించారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసు కోవాలని, పూర్తి వివరాల కోసం 9030850336 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వారం రోజులుగా నిలిచిన రిజిస్ట్రేషన్లు



మర్పల్లి తహసీల్దార్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయంలో ఖాళీగా ఉన్న కుర్చీ

మర్పల్లి, నవంబర్ 18: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో వారం రోజులుగా పలు రకాల రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. వారం క్రితం తహసీల్దార్ మునీరొద్దీన్‌కు చాతీలో నొప్పివచ్చి హైదరాబాద్‌లోని ఓ దవాఖానాలో చికిత్స పొందుతున్నాడు. అప్పటి నుంచి మండల ఇన్‌చార్జీ తహసీల్దారుగా కానీ నూతన తహసీల్దార్‌ను నియమించకపోవడంతో భూమి అమ్మకం, కొనుగోలు, విరాసత్ రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో పాటు విద్యార్థులకు ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు అందడం లేదని వివిధ గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుక్ చేసుకుని ప్రతి రోజూ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్ కోసం ఎదురు చూసి ఇంటికి వెళ్తున్నట్లు పలువురు పేర్కొంటున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు ఇన్‌చార్జి తహసీల్దార్‌ను కానీ నూతన తహసీల్దార్‌ను కానీ మండలానికి నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు..

నేడు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ధారూరు, నవంబర్ 18: రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదేశానుసారం మండల పరిధిలోని రాంపూర్ తండా, గురుదోట్ల, నాగారం, మోమిన్‌కలాన్ గ్రామాల్లో మంగళవారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్, పీఏసీఎస్ చైర్మన్లు, పీఏసీఎస్ వైస్ చైర్మన్లు, డైరెక్టర్లు, తాజా మాజీ ఎంపీపీ, తాజా మాజీ జడ్పీటీసీలు, తాజా మాజీ ఎంపీటీసీలు,తాజా మాజీ సర్పంచులు, వ్యవసాయ అధికారులు, ప్రజాప్రతినిధులు, కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న కుటుంబ సర్వే

దౌల్తాబాద్, నవంబర్ 18: సమగ్ర కు టుంబ కులగణన సర్వేను పక్కా ప్రణా ళికబద్ధంగా నిర్వహించాలని ఎంపీడీవో శ్రీనివాస్ ఎన్యూమరేటర్లకు సూచించారు. సోమవారం మండలంలోని గోళ్ల ఫస్లావాద్,ర్యాలగుట్ట తండా, దౌల్తాబాద్, పోల్కంపల్లి గ్రామాల్లో చేపడుతున్న ఇంటింటి కులగణన సర్వేను ఆయన పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మైలార్‌దేవ్‌పల్లి, నవంబర్ 18: చాంద్రాయణగుట్ట ప్రాంతానికి చెందిన సుక్యానాయక్ (50) వ్యాపారి. సోమవారం అతడు బైక్‌పై చాంద్రాయణగుట్ట నుంచి ఆరాంఘర్ వైపు వెళ్తున్నాడు. దుర్గానగర్ ప్రాంతంలో యూటర్న్ చేస్తుండగా..వెనుక నుంచి వచ్చిన లారీ సుక్యానాయక్ బైక్‌ను ఢీకొట్టింది. దీంతో సుక్యానాయక్ రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆకస్మికంగా పశువైద్య కేంద్రాలు తనిఖీ



పులుమామిడిలో రికార్డులను తనిఖీ చేస్తున్న జిల్లా పశు వైద్య అధికారి సదానందం

నవాబుపేట, నవంబర్ 18: మండల కేంద్రంలోని పశు వైద్య కేంద్రాలను వికారాబాద్ జిల్లా పశువైద్య అధికారి వి. సదానందం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సోమవారం నవాబుపేట, యెల్లకొండ, మాదిరెడ్డిపల్లి, పులుమామిడి గ్రామాల పశు వైద్య కేంద్రాలను తనిఖీ చేసి అక్కడ ఉన్న వైద్యులతో విషయాలను అడిగి తెలుసుకున్నారు. నెల రోజులుగా జరిగిన ఉచిత గాలికుంటు టీకాల పంపిణీపై ఆరా తీశారు. పశు వైద్యులు రైతులకు అందుబాటులో ఉండి పశువులకు కావల్సిన మందులు, టీకాలను అందించాలన్నారు. పశువుల ఆరోగ్యాలు పదిలంగా ఉండేటట్లు రైతులకు పలు జాగ్రత్తలు, సూచనలు చేశారు. పులుమామిడి పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేసిన అనంతరం మాట్లాడుతూ ఐదు సంవత్సరాలకు ఒక్కసారి నిర్వహించే పశు గణనను డిసెంబరు మొదటి వారం నుంచి ఫిబ్రవరి వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 75శాతం సబ్సీడీతో పశువులకు పశుగ్రాసం అందజేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కొడంగల్, నవంబరు 18: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని చిట్లపల్లి టోల్‌గేట్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివ రాల మేరకు.. దౌల్తాబాద్ మండలానికి చెందిన వెంకటమ్మ కుమారుడు సురేశ్ (17) అతని స్నేహితులు అలీ, మహేందర్‌లతో కలిసి ఆదివారం పట్టణంలో నిర్వహించిన సదర్ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చాడు. తిరుగు ప్రయాణంలో రాత్రి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా చిట్లపల్లి టోల్‌గేట్ సమీపంలో లారీ వెనకనుంచి వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటలో తీవ్ర గాయాలు కాగా సురేశ్‌ను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మన్నెగూడ దగ్గర మృతి చెందినట్లు తెలిపారు. మిగతా ఇద్దరు స్నేహితులకు గాయాలు కావ డంతో చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు వివరించారు. ఘటనపై మృతుడి తల్లి వెంటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హామీలను అమలు చేస్తున్నాం..

ప్రజాపాలన విజయోత్సవాలను ప్రారంభించిన స్పీకర్ గడ్డం ప్రసాద్

కొడంగల్, నవంబర్ 18: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని రాఘవేంద్ర ఫంక్షన్ హాల్‌లో ప్రజాపాలన విజయోత్సవాలను జిల్లా యంత్రాంగంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి రూ.500లకే గ్యాస్ సిలెండర్, గృహజ్యోతి పథకం కింద 200ల యూనిట్‌ల కంటే తక్కువ విద్యుత్ వినియోగిస్తున్న గృహాలకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. పేద, బడుగువర్గాల సొంత ఇంటికల నెరవేర్చేందుకు ప్రతి నియోజకవర్గంలో 3500ల ఇందిరమ్మ ఇండ్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిపారు. అన్ని వార్గాల వారికి చేయూతను అందిస్తూ.. ఆధునిక పరిశ్రమల అవసరాలకు తగినట్లుగా రాష్ట్ర యువతకు తీర్చిదిద్దేందుకు 65 ఐటీఐ లను అధునాతన సాంకేతిక కేంద్రాలుగా తీర్చిదిద్దుతుందన్నారు. వికారాబాద్ జిల్లా కేంద్రంలో స్కిల్ యూనివర్సిటీకి అనుబంధంగా ఐటీఐ ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు ప్రోత్సాహం. ఈ ఏడాది రాష్ట్రం మొత్తంలో 8మెడికల్ కాలేజీలకు కేంద్రం నుంచి అనుమతులు సాధించినట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కింద 26,825 పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 1135 కోట్లు కేటాయించిదని, పాఠశాలల నిర్వహణ బాధ్యతలను మహిళా సంఘాలకు అప్పగించడం జరుగుతుందన్నారు. సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ అలేఖ్యపుంజుల బృందంతో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో పరిగి, తాండూరు ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, ఎస్పీ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, గ్రంథాలయ చైర్మన్లు రాజేశ్వర్‌రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గ్రంథాలయ వారోత్సవాలు

వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

వికారాబాద్, నవంబర్ 18 : 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా గ్రంథాలయంలో సోమవారం పాఠశాల విద్యార్థులకు ఉపన్యాస , వ్యాస రచన పోటీలు నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ–విద్యార్థుల పాత్ర అనే అంశం పై ఉపన్యాస పోటీ, పుస్తక పఠన–ఆవశ్యకత అనే అంశం పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల, జడ్పీహెచ్ఎస్ కొత్తగడి, సంఘం లక్ష్మీబాయి, ఎస్టీ జూడ్స్, న్యూ నాగార్జున హైస్కూల్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ మంగళవారం రంగోలి, మెహంది, చిత్రలేఖనం కార్యక్రమాలు ఉంటాయని గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి. సురేశ్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

25న పాంబండపై లక్షబిల్వార్చన

కులకచర్ల, నవంబర్ 18 : ఈ నెల 25న ఉదయం 10గంటలకు పాంబండ రామ లింగేశ్వర స్వామి దేవాలయంలో సామూహిక లక్షబిల్వార్చన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు దేవాలయ కార్యనిర్వహ ణాధికారి సుధాకర్, పూజారి పాండు తెలిపారు. పాల్గొనదల్చిన వారు రూ.250 చెల్లించి రశీదు పొందాలని అన్నారు. పూజలో పాల్గొనువారు సంబంధిత సామగ్రి, గ్లాసు, ప్లేటు, సాంప్రదాయ దుస్తులతో రావాలని అన్నారు.

ఈ ఇంజినీర్ మోసగాడు

■ ఓఎల్ఎక్స్ వేదికగా నేరాలు ■ ఆరేండ్లుగా 200 మందికి టోకరా ■ అరెస్టు చేసిన పోలీసులు

ఖైరతాబాద్, నవంబర్ 18: దేశంలోని ఓ ప్రముఖ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ పట్టా పొందాడు. జల్సాలు, విలాసవంతమైన జీవితం కోసం తప్పుడు మార్గాన్ని ఎంచుకున్నాడు. ఓఎల్ఎక్స్ వేదికగా నేరాలకు పాల్పడ్డాడు. గత ఆరేండ్లుగా పోలీసుల కంట్లో పడకుండా తప్పించుకొని తిరుగుతున్న ఓ అంతర్రాష్ట్ర మోసగాడిని పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పంజాగుట్ట పీఎస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏసీపీ మోహన్ కుమార్, ఇన్‌స్పెక్టర్ శోభన్, డీఐ శ్రావణ్ కుమార్ కలిసి వివరాలు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్, తిరుపతిలోని భవానీనగర్‌కు చెందిన ఎం.బాలాజీ నాయుడు అలియాస్ బాలాజీ (35) ఓ ప్రముఖ యూనివర్సిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ పట్టాను పొందాడు. డబ్బులు సంపాదించేందుకు చెడు మార్గాన్ని ఎంచుకున్నాడు. ఇందుకు ఓఎల్ఎక్స్‌ను ఉపయోగించుకున్నాడు.

జల్సాల కోసం నేరాల బాట..

ఎవరైనా ఖరీదైన ఫోన్లను విక్రయించేందుకు ఓఎల్ఎక్స్‌లో పెడితే.. విక్రయిస్తున్న వ్యక్తితో పాటు కొనుగోలు దారుడిని అడ్డంగా మోసగించి డబ్బులు తన ఖాతాలోకి వేసుకుంటాడు. ఎవరైనా ఓఎల్ఎక్స్‌లో సెల్ ఫోన్‌ను అమ్మకానికి పెడితే తాను కొనుగోలు చేస్తానని చెబుతాడు. సంప్రదింపులు చేసి ఫోన్‌తో పాటు దానికి సంబంధించిన పత్రాలను కాపీ చేసుకుంటాడు. తాను ఎలాగైనా కొంటున్నాను కదా.. ఓఎల్ఎక్స్‌లో నుంచి డిలీట్ చేయమని చెబుతాడు. అతను డిలీట్ చేయగానే ఆ ఫోన్ల వివరాలను తన నంబర్ ద్వారా ఓఎల్ఎక్స్‌లో తక్కువ రేటుకే విక్రయిస్తున్నట్లు వివరాలు పెడుతాడు. ఎవరైనా ఆ ఫోన్లను కొనుగోలు చేసేందుకు ముందుకొస్తే ఫలానా చోట కలువాలని, తన సోదరుడు వచ్చి ఆ ఫోన్‌ను చూపిస్తాడని, అక్కడ ఫోన్ తీసుకొని డబ్బులు మాత్రం తన అకౌంట్‌కు బదిలీ చేయాలని చెబుతాడు. అలా తన

వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ మోహన్ కుమార్

ఖాతాలో డబ్బులు పడగానే ఉడాయిస్తాడు. 2018 నుంచి ఇప్పటి వరకు 200 మందిని మోసం చేసి లక్షలాది రూపాయలు దండుకున్నా డని ఏసీపీ తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు పోలీసు కమిషనరేట్లతో పాటు ఏపీలోని తిరుపతి, విజయవాడ తదితర ప్రాంతాల్లో ఈ తరహా నేరాలకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. బెంగళూరు, తిరుపతి, విజయవాడలో అరెస్టు అయ్యాడని, అతడిపై పంజాగుట్ట, మధురానగర్ పీఎస్ పరిధిలో మూడేసి చొప్పున కేసులు ఉన్నాయన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్స్ రిపోర్టింగ్ పోర్టల్‌లో 23 సిమ్‌కార్డులను వినియోగించాడని, 138 మంది బాధితులు నిందితుడిపై ఫిర్యాదు చేశారని, వెలుగులోకి రాని వారి సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉంటుందని ఏసీపీ చెప్పారు. మోసాల ద్వారా సంపాదించిన డబ్బును ఆన్‌లైన్ గేమ్స్‌లో పెట్టు బడిగా పెట్టి వాటిని పోగొట్టుకోవడం, సొమ్ము రాగానే జల్సాలు చేయడం అతడి ప్రవృత్తి అని తెలిపారు. ఆ మేరకు నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఎస్సైలు శివశంకర్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

తాగిన మైకంలో
ఏఎస్ఐపై దాడి

అబిడ్స్, నవంబర్ 18 : దాడి జరిగిందని అందిన ఫిర్యాదు మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న ఏఎస్ఐపై ఓ వ్యక్తి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన మంగళ్‌హాట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బాబాబాలక్‌దాస్ మర్ ప్రాంతంలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ్ కథనం ప్రకారం.. అప్పర్ ధూల్‌పేట సమీపంలోని బాబా బాలక్‌దాస్ మర్ ప్రాంతానికి చెందిన చోటూ సింగ్ (26) శనివారం అర్ధరాత్రి తాగిన మైకంలో రాజా సింగ్‌తో గొడవకు దిగాడు. ఇంతలోనే రాజాసింగ్ కుమారులైన సిద్దాంత్, అరుణ్ సింగ్ అడ్డుకునే ప్రయత్నం చేయగా.. ఇంట్లోకి వెళ్లి కొబ్బరిబొండాం కట్ చేసే కత్తి తీసుకొచ్చి దాడి చేశాడు. స్థానికులు 100 నంబర్‌కు డయల్ చేయగా.. సమాచారం అందుకున్న ఏఎస్ఐ శ్రీనివాస్ అక్కడికి చేరుకున్నాడు. చోటూ సింగ్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించే క్రమంలో ఏఎస్ఐ ముఖంపై కొట్టాడు. విషయం తెలుసుకున్న ఇతర పోలీసులు అక్కడికి చేరుకుని నిందితుడిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. ఈ కేసును ఇన్‌స్పెక్టర్ మహేశ్ గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ రాజు దర్యాప్తు చేస్తున్నారు.

డ్రగ్స్ రహిత తెలంగాణ 2కే రన్
పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

చిక్కడపల్లి, నవంబర్18: తెలంగాణ విద్యా సమితి ఆధ్వర్యంలో డిసెంబర్ 21న నెక్లెస్ రోడ్డులో నిర్వహించనున్న డ్రగ్స్ రహిత తెలంగాణ 2కే రన్‌కు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు పెండెం తారక్ గౌడ్, అనిల్, అశోక్, రాజబాబు, సాయినాథ్ రెడ్డి, శ్యాం రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కారు డ్రైవింగ్

- పార్క్ చేసిన ఆటోను ఢీకొట్టిన కారు

బంజారాహిల్స్, నవంబర్ 18: మద్యం మత్తులో కారు నడిపించడంతో పాటు మితిమీరిన వేగంతో వస్తూ రోడ్డు పక్కన పార్క్ చేసిన ఆటోను ఢీకొట్టారు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లాకు చెందిన గోవింద్ ఆటో డ్రైవర్. ఆదివారం తెల్లవారుజామున శ్రీనగర్ కాలనీలోని మెడ్‌ఫస్ మెడికల్‌షాపు వద్ద ఆటోను పార్క్ చేసుకుని పక్కనే నిలబడి మరో వ్యక్తితో మాట్లాడుతున్నాడు. అదే సమయంలో అతివేగంతో వచ్చిన కారు పార్కింగ్ చేసి ఉన్న ఆటోను ఢీ కొట్టింది. అంతటితో ఆగకుండా పక్కనున్న డివైడర్‌ను ఢీకొట్టింది. దీంతో డివైడర్ ధ్వంసమైంది. ఆటో తుక్కు తుక్కయ్యింది. కారు నడిపిస్తున్న వ్యక్తి మద్యం మత్తులో ఉన్నట్టు గుర్తించిన ఆటో డ్రైవర్.. అతడిని నిలదీసేందుకు యత్నించాడు. మా కుటుంబ సభ్యులు పోలీసు శాఖలో పనిచేస్తున్నారు.. ఎక్కువగా మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కారులో మొత్తం ఐదు గురు ఉన్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని, వారంతా మద్యం తాగి వస్తున్నట్లు అనుమానంగా ఉన్నదని పేర్కొంటూ బాధితుడు ఆదివారం రాత్రి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయ గా బీఎన్ఎస్ 110, 324(4),5), 125, 281, 351(2)(3) రెడ్‌విత్ 49 బీఎన్ సెక్షన్లతో పాటు మోటార్ వెహికల్ యాక్ట్, పీడీపీపీ యాక్ట్ కింద కేసు దర్యాప్తు చేపట్టారు.

అగ్నిప్రమాదం
గుడిసెలు దగ్ధం

బంజారాహిల్స్,నవంబర్ 18: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని గురుబ్రహ్మనగర్ బస్తీలో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించింది. పోలీసుల కథనం ప్రకారం.. గురుబ్రహ్మనగర్ బస్తీ నివాసి అశోక్ గుడిసెలో కరెంట్ మీటర్ వద్ద షార్ట్ సర్క్యూట్ కారణంగా సోమవారం ఉదయం మంటలు చెలరేగాయి. గుడిసెలో ఎవరూ లేకపోవడంతో అదుపు చేయలేదు. దీంతో కరెంట్ వైర్లు కాలుతూ వచ్చి సామగ్రికి మంటలంటుకున్నాయి. గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్‌పై ఉన్న రెగ్యులేటర్ కాలిపోవడంతో ఒక్కసారిగా గ్యాస్ లీకై మంటలు మరింతగా వ్యాపించాయి. పక్కనే ఉన్న రెండు గుడిసెలకు కూడా మంటలు వ్యాపించాయి. దీంతో ఒక్కసారిగా బస్తీలోని వారంతా బయటకు పరుగులు తీశారు. ఫిలింనగర్ ఫైర్ స్టేషన్ సిబ్బంది అక్కడికి వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో అశోక్ గుడిసెలోని సామగ్రి మొత్తం కాలి బూడిదవ్వగా.. మరో రెండు గుడిసెల్లోని సామగ్రి పాక్షికంగా కాలిపోయింది. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు విచారణ చేపట్టారు. అగ్ని ప్రమాదం ఘటన గురించి తెలుసుకున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ బస్తీకి చేరుకుని బాధితులను పరామర్శించారు. బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గురుబ్రహ్మనగర్ బస్తీలో పక్కా ఇండ్లు నిర్మించాలని, అప్పుడే బస్తీ ప్రజలు సమస్యల నుంచి బయటపడుతారని పేర్కొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా, శ్రీ ఇ. లింగం తండ్రి క్రీ/శే॥ ఇ. నర్సింలు, వయస్సు 28 సం॥లు, వృత్తి: వ్యవసాయము, నివాసము ఇం.నెం.2-62, గుండెడు గ్రామం, బాలానగర్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా. తెలంగాణ వాస్తవ్యుల స్వార్జితం క్రీంద సంపాదించిన ఆస్తిని తనఖా పెట్టుకొని శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, షాద్‌నగర్ బ్రాంచ్ వారు లోను ఇవ్వడానికి నిశ్చయించినారు. కావున ఇట్టి యొక్క ఆస్తిపై ఎవరికైనా ఆరోపణలుగాని, ఆక్షేపణలుగాని ఉన్న యెడల 3 రోజులలోగా మా బ్రాంచినందు సంప్రదించగలరు. లేనిచో ఈ యొక్క ఆస్తిపై ఎలాంటి వివాదాలు లేనివిగా పరిగణించి మా క్ల